ఓంశ్రీసాయిరాం.

విద్య డిగ్రీల కొరకని వెఱ్ఱివీడి
సేవకా వృత్తికై మీరు చేరబోక
స్వీయదేశీయ సౌభాగ్యమరసి
జగతి శ్రామిక విద్యలన్ చదువ వలయు.
విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పు
సంకుచిత భావములనెల్ల సమయజేసి
ఐహిక సహజీవనాదికమెల్లగూర్చి
సమత నేర్పుటయె కాదె సరసవిద్య.

ప్రేమస్వరూపులారా! విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాపోషకులారా!

ప్రాచీన కాలమునుండియు అనేకరకముల ఆదర్శములను, ఆదేశములను యితర దేశములకు అందించి చిర శాంతి సౌభాగ్యములను చేకూర్చిన భారతదేశము, ఎప్పుడును 'లోకాసమస్తా సుఖినో భవంతు' అను పవిత్ర ఆదర్శమును నిలబెట్టుటకు పాటుపడిన భారతదేశము నేడు అన్ని రంగములలోను, అన్నివిధముల వెనుకంజ వేయుచున్నది. ప్రపంచమునే తీర్చిదిద్దవలసిన భారతీయులు నేడు సాంకెతిక విద్యలకు వశులై, ధనమునకు దాసులై స్వేచ్ఛావిహారము చేయుచుండుట శ్రేయస్కరము కాదు. విద్య రెండు మార్గములను ప్రబోధించును. అవి జీవితమంటే ఏమిటి, ఎట్లు జీవించాలి? కాని, నేడు భారతీయులు ఇట్టి పరమ లక్ష్యమును పవిత్ర మార్గమును విస్మరించి లౌకిక మార్గములు అనుసరిస్తున్నారు. ఈనాటి మానవుడు విజ్ఞానశాస్త్రము అభివృద్ధి చేసుకొని కేవలము పక్షులవలె ఎగురుట, చేపలవలె నీటిలో తేలియాడుట చేయుచున్నారుగాని మానవుల వలె జీవించుటలేదు. చేపలవలె నీటిలో నడయాడుటకు, పక్షులవలె ఎగురుటకు సైన్సు ఆధారమే కాని భూమిపై మానవునివలె నివసించుటకు ఆధ్యాత్మికమే అవసరము. ఆధ్యాత్మికములేని సైన్సు గ్రుడ్డిది, సైన్సులేని ఆధ్యాత్మికము కుంటిది. ఆధాయత్మికము లేని సైన్సు దుర్వినియోగపడును. సైన్సు లేని ఆధ్యాత్మికము హాస్యాస్పదమగును. అందుచే ప్రతి మానవుడు పవిత్ర ఆధాయత్మ తత్త్వము అనుసరించాలి.

సైన్సులో అన్నిరకముల అంతరార్థములు, పరిశోధనలు జరిపి అనుసరింఛుచున్ననూ కొంచెము ఆధ్యాత్మిక తత్త్వమును గుర్తించాలి. కేవలము మానవుడు బహిర్భావమును గుర్తించుచున్నాడుగాని అంథర్భావమును గుర్తించుటలేదు. ఒక వెలుగు కిరణము ఒక క్షణములో లక్షా ఎనభై వేల మైళ్ళు ప్రయాణము చేయుచున్నదని సైన్సు చెప్పును. అట్టి లైటు భూప్రదక్షిణము చేయుటకు సెకండ్ల కాలము తీసుకొనును. నక్షత్ర, సూర్య, చంద్ర మండలములు చుట్టుటకు ఎన్ని సంవత్సరములు పట్టును? ఈవిధముగా గ్రహములుగాని, నక్షత్రములుగాని తమతమ మార్గములు సక్రమముగా అనుసరించుటచే సృష్టి క్షేమముగానున్నది. వేగము, కాలము తబ్బిబ్బైన సృష్టి తారుమారగును. ఇవి సక్రమముగా తమతమ మార్గములను, వేగమును అదుపులోనుంచుకొనుటకు ఏదో ఒక దివ్యశక్తి ఉందనుటకు నిదర్శనము కదా! ఇట్టి దివ్యతత్త్వమును గుర్తించక తన శక్తిని వ్యర్థము చేయుచున్నాడు. ఈ దివ్యశక్తి కనిపించినా, కనిపించకపోయినా సర్వత్రా వ్యాపించి ఉన్నది. ఈ సత్యమును గుర్తించలేని అనేకులు దైవత్వము కాదని హాస్యాస్పదము చేయుచున్నారు. నిజముగా ఈ దివ్యత్వమును చూచుటకు వీలులేకపోయిననూ కొన్ని అనుభవములలో తెలుసుకొనవచ్చును కదా! చూడలేనిది కాదనుటకు వీలులేదు. ఒక పదార్థమును పైకి గిరవాటు వేసిన అది తప్పక క్రిందపడును. దీనికి భూమియొక్క ఆకర్షణ శక్తియే కారణము. క్రింద భూమి కనుపించుచున్నదిగాని ఆకర్షణశక్తి కనిపించుటలేదు. ఇది కనిపించకపోయిన లేదా! కాదుకాదు. ఉన్నది. ఇదే దివ్యత్వము. ప్రతి మానవుడు అర్థముచేసుకోవాలి. ఈనాటి విద్యావిధానములో నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక తత్త్వము లేకపోవుటచే ఇది ఆలోచించలేకున్నారు. కేవలము మెకాలేయొక్క అనుభూతులను సంస్మరిస్తూ, త్యాగభూమియైన భారతదేశముయొక్క గొప్పతనమును విస్మరించుట మంచిదికాదు. ఇది నిజమైన భారతవిద్య కాదు.

ఉన్న ఆస్తిపాస్తులు అమ్ముకొని, డిగ్రీ సంపాదించి భిక్షాపాత్రతో తిరిగినట్లు ఉద్యోగాన్వేషణ చేయుట భారతీయవిద్య కాదు. త్యాగము, క్రమశిక్షణ, అందము, బలమునిచ్చి తన కాళ్ళపై తాను నిలబడగల శక్తినిచ్చునది భారతీయవిద్య. అన్యాయ, అక్రమ, అసత్యాన్ని ఎదిరించకలిగిన శూరత్వాన్ని, వీరత్వాన్ని, ధీరత్వాన్ని, మానవత్వాన్ని యిచ్చునదే భారతీయవిద్య. నవ్వుతూ నవ్వుతూ తన జీవితాన్నే దేశమునకు అర్పించగల శక్తినిచ్చునదియే భారతీయవిద్య. స్వార్థమును త్యాగముచేసి పవిత్రత్వాన్ని అభివృద్ధిచేసుకోగల వివాకాన్నిచ్చునదియే భారతీయవిద్య. త్యాగశీలురైన యోగులను, శ్రమించగల పారిశ్రామికులనిచ్చునదియే భారతీయవిద్య.

సువిశాల భావాన్ని అలవరచుకోలేని భారతీయుడు దేశమునకు, ప్రపంచమునకు ఏమి ప్రయోజనము? నేడు దేశమును రక్షించు తారకమంత్రము రాజకీయములు, తుపాకులు, ఆటంబాంబులు కావు. ప్రతి భారతీయుని కరడుగట్టిన హృదయములోనూ స్వార్థత్యాగము, ఆధ్యాత్మికము, దేశప్రేమ మొదలగు అష్ట షష్ట విద్యలు మొలకెత్తవలెను. ఏనాడు మన జీవితమును త్యాగములో, ప్రేమలో ప్రవేశపెట్టుదుమో

ఆనాడు మన దేశము కలకలా కిలకిలా నవ్వుతూ ఉండును. నేడు మానవునికి మానవునికీ మధ్యగల సంబంధమును గురించి వర్తించగల విద్య కావాలి. కేవలము గ్రంథపరిచయము విద్యకాదు. నేటి విద్యార్థులు మార్కుల కొరకు పరుగెడుతున్నారుగాని రిమార్కులకోసం పాటుపడుటలేదు. నిజముగా సరస్వతీ నివాసములైన విద్యాలయములు నేడు లక్ష్మీనివాసములైనవి. అడ్మిషన్‌కి డబ్బు, పాసుకు డబ్బు.అందుకే మన హృదయములు జబ్బుపడుతున్నవి. ఇట్టి పరిస్థితులను దూరముచేసి, ఆత్మవిద్య అలవర్చుకొనిన సమాజముయొక్క సౌభాగ్యము, దేయముయొక్క సంపత్తి, బలము యినుమడించును.

"education is not just aquiring knowledge but putting in practice" అందుచే నిత్యజీవితములో అనుభూతిలోని, ఆచరణలోనికి తెచ్చుకోగల విధముగా విద్యను మార్చుకోవాలి. 'విద్య'లో 'విత్' (ప్రకాశము) 'య' (ఏది) అనగా ఏది మనకు ప్రకాశమునందించునో, అజ్ఞానమును తొలగించునో అది విద్య. నేడు విద్యార్థి ఎంత విద్యావంతుడగుచున్నాడో అంత అజ్ఞానుడగు చున్నాడు. వినయము విద్యయొక్క లక్షణము. సమత్వముపండిత లక్షణము. ఈ రెండింటి సమ్మిళితమే భారతీయ సంస్కృతి. ఇదియే యుగయుగముల జగజగముల కోటి కంఠములతో గానముచేయబడుచున్నది. నా దృష్టిలో సరియైన లక్షణములు, నిర్మల నిశ్చల లక్షణములు గలవారు అనేకమంది కలరు. కాని, దుదృష్టవశమున గృహములో తల్లిదండ్రులు, విద్యాలయములో అధ్యాపకులు వారిని పెడదారి పట్టిస్తున్నారు. నిత్యజీవితములో పిల్లలకు మితిమీరిన స్వేచ్ఛనిచ్చి పెడదారిని పట్టిస్తున్నారు. మానవునకు స్వేచ్ఛ అవసరమే కాని మితిమీరిన స్వేచ్ఛ మతి చెరచును. అందుచే

the end of education is character

the end of culture is perfection

the end of wisdom is freedom

అను విషయము గుర్తించాలి. ఏమీ తెలియని అమాయకులైన విద్యార్థులను అధ్యాపకులు సరియైన మార్గములో తర్ఫీదునిచ్చిన బలమైన, దివ్యమైన సద్గుణవంతులు, సదాచారపరులైన వారిగా తయారగుదురు. కుమారునకు 6గంటలకు ఇంటికి రావాలని శాసించిన తల్లిదండ్రులు 12గంటల వరకు కబ్బులో కూర్చున్న ఇక శిక్షణ ఏమిటి? బాధ్యతాయుతముగా ప్రవర్తించి నాయకత్వము వహించవలసిన తల్లిదండ్రులు, ఆధ్యాపకులు ఈవిధముగా ప్రవర్తించిన భారతదేశమునకు ఎట్టి ప్రఖ్యాతీ తేలేరు. అధ్యాపకులు, తల్లితండ్రులు ముందంజవేసి ఆదర్శముజూపి బిడ్డలను తీర్చిదిద్దాలి. హిస్టరీ పాఠము ఒక పుస్తకము చూచి నేర్పవచ్చు. లెక్కలు బోర్డుమీద వేసి, చేసి చూపవచ్చు. కాని, డ్రిల్‌టీచరు 1,2,3,4, అని చెప్పి, చేసి విద్యార్థులచే ఆవిధముగా చేయించును.

మానవులు పాపభీతి, దైవప్రీతి మరచిపోయి పశువుగా తయారౌచున్నాడు. మానవునికి ఉండవలసిన కాన్ఫిడెన్స్ లేకపోవుచున్నది. కాని, తృప్తి కావాలి. కాన్ఫిడెన్స్ లేకపోయిన తప్తి ఎక్కడ? త్యాగభావమెక్కడ? సాక్షాత్కారమెక్కడ? అందుకే జీవిత సౌధమునకు

self confidence is the foundation

self satisfaction is the wall

self sacrifice is the roof

self realisation is life itself.

మానవులు ఖానా, పీనా, సోనా, మర్నాలో జీవితము నడపకూడదు.

Life is challange, meet it.
Life is love, share it.
Life is dream, realise it.
Life is game, play it.

ఈనాటి యువకులు దివ్యమైన ఫలములవంటివారు. ఇందులో మధురమైన రసమున్నది. ఇట్టి పవిత్ర ఫలములకు అనేక అడ్డంకులు ఉండును. ఇట్టి సమయములో ఏది మంచి, ఏది చెడ్డ, ఏది గ్రహించాలి, ఏది త్యజించాలి అనునది విచారణ సలిపి ముందంజవేసి అందుకోవాలి. దీనికి ఉదాహరణముగా రామాయణములోని రాముని ఆదర్శమును తీసుకోవాలి. రాములవారు తన గురువైన విశ్వామిత్రునితో వెడుతుండగా దారిలో ఒక స్త్రీ అడ్డువచ్చింది. రాముడు పవిత్రమైన వయస్సులో, తియ్యని రసము కలిగిన ఫలముగా–యువకుడుగా ఉండుటచే ఆ స్త్రీ అడ్డువచ్చెను. రాముడు వెంటనే ఆ స్త్రీని ఖండించెను. తరిగి కొంత దూరము వెళ్ళగా మరొక స్త్రీ అడ్డు వచ్చిన ఆమెకు గుణపాఠము చెప్పి, ఆమెను భర్తతో చెర్చెను. మిథిలకు వెళ్ళిన తరువాత మూడవ స్త్రీ ముందుకు వచ్చెను. ఆ స్త్రీని రాములవారు స్వీకరించెను. తమోగుణముతో కూడిన తాటకిని సంహరించి, రజోగుణ మగ్నమైన అహల్యను సంస్కరించి, సాత్విగుణ సంపన్నురాలైన సీతను అంగీకరించెను. ఇది ఈనాటి యువకులకు పవిత్ర ఆదర్శముగా, గుణపాఠముగా ఉండవలెను. తనలోని తమోగుణాన్ని సంహరించాలి. రజోగుణాన్ని సక్రమ మార్గంలో పెట్టాలి. సాత్వికాన్ని పోషించాలి. ఈ సాత్వికమే మన జీవితముయొక్క సారమని

గ్రహించాలి. ఇట్టి వారు భారతదేశములో విరివిగా అభివృద్ధిచెంది, ఇతర దేశములలో వ్యాపించాలని నేను ఆశిస్తున్నాను.

విద్యార్థులుగా ఉన్న ఈ చిన్న వయస్సులోనే పవిత్ర భావములు అలవరచుకొనకపోయిన భవిష్యజ్జీవితములో చాలా కష్టములు కలుగును. కనుక, start early, drive slowly, reach safely అనుట. ఈ శరీరము, రక్తము, చర్మము, కండలు ఇదే జీవితమని మానవుడు భావిస్తున్నాడు. కాని, దీనిలో మనస్సు అను శక్తి ఉంది. ఈ మనస్సును అరికట్టు ఆత్మ ఒకటి ఉంది. కనుక

you are not one person but three.
the one you think you are
the one others think you are
the one you really are.

మనం ఏ పని చేసినా పవిత్రంగా, ప్రేమతో, ఆనందంగా చేయటానికి ముందంజ వేయాలి. అందుకు, duty without love is deplorable, love without duty is divine, duty with love is desireble అని గ్రహించాలి. మానవుడు ఏ పని చేసినా ఇష్టంగా చేసిన నిజమైన ఆనందము వచ్చును. అంతేగని మనకి ఇష్టమైనది చేయుట వలన కాదన్న సత్యాన్ని గుర్తించాలి.

భారతదేశమునకు కేంద్రమైనది, నాభీస్థానమైనది ఈ ఢిల్లీ పట్టణము. అన్ని రంగములకు కూడా ఇది నాభీస్థానము. నైతిక, ఆధ్యాత్మిక, భౌతిక, రాజకీయ రంగములకిది ఆటపట్టు. ఇట్టి ఢిల్లీ పట్టమును ఆధ్యాత్మిక, విద్యారంగములలోసరియైనసేవలుచేసి ఆదర్శవంతముగా నుండునట్లు చూడాలి. అన్ని రంగముల నాయకులు ఇక్కడ నివసిస్తున్నారు. లీడర్స్ సరియైన స్థితిలోనున్న అనుచరులు సరిగానుందురు. విద్యార్థులు తాము విద్యార్థులమని విఱ్ఱవాగక తమ పనలు తాము చేసుకోవాలి. అభిమాన మమకారములు, స్వార్థము పక్కకు నెట్టి వినయముతో పనులు చేసుకోవాలి. విద్యార్థులే భావిభారతోద్ధారకులు. వారు మంచి మార్గమును అనుసరించిన దేశము సరియైన మార్గములో ఉండును. అందును ఢిల్లీ పట్టణమందు ఆదర్శ పాఠశాలలు స్థాపించి, విద్యారంగములో మార్పులు కూర్పులు చేసి విద్యార్థులు ఆదర్శజీవితములను గడుపునట్లు చేయాలి. ఈనాడు ప్రజలలో చెలరేగిన అన్యాయములకు నైతిక, ఆధ్యాత్మిక, ధార్మిక తత్త్వము లోపించుటయే కారణము. కనుక, ఇట్టి పవిత్ర విద్యలను మోరల్ క్లాసుల ద్వారా ప్రవేశపెట్టి 'విద్య యొసగును వినయము' అన్నట్లు విద్యార్థులలో వినయము పెంపొందునట్లు చూడాలి. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిధిదేవోభవ' అను సూత్రములను విద్యార్థులలో ప్రవేశపెట్టి, మొదట తల్లిదండ్రులను గౌరవించుట నేర్పాలి. ఈనాడు నీవు నీ తల్లిదండ్రులను ప్రసన్నులను చేసిన, నీ పిల్లలు నిన్ను ప్రసన్నులను చేతురు. అందుకే మనకు ప్రతి పనిలోనూ రియాక్షన్, రీసౌండ్, రిఫ్లక్షన్ తప్పలేదు. అధ్యాపకులు, విద్యార్థులుప్రేమను అభివృద్ధి చేసుకొని ఆదర్శవంతులుగా ఉండాలని ఆశిస్తున్నాను.

మానవులకు సంపర్కము వలనే మంచిగాని, చెడ్డగాని జరుగుచున్నది. మాలలోని విలువలేని దారము విలువైన పూలలో చేరి అందరి మెడలను అలంకరిస్తుంది. ఎవరును దారమును తలపైకాని, కంఠములోగాని ధరించరు. పూలయొక్క సంపర్కముచే దారమున కట్టి ఉన్నత స్థానము. పర్వతము మీది గుండురాతిని ఎవరూ పూజించరు. కాని, దానిని శిల్పియొక్క సంపర్కము, సంకల్పముచే పూజించి, ఆరాధింతురు. నిత్యము అనేకమైన ఎలుకలను చూతుము. వాటిని చూచిన వెంటనే పట్టి చంపుదుము. అట్టి ఎలుక వినాయకుని వాహనమైనప్పుడు దానిని ఆరాధింతురు. సర్పమును గాంచిన హతమార్చుదుము. కాని, అదే సర్పము శివునిపై చూచిన ఆరాధింతురు. అట్టి శక్తికి కారణము భగవంతుని సంపర్కమే. అల్పస్థాయి వస్తువుమహాన్ స్థాయికి చేరుటకు సంపర్కము కారణమగుచున్నది. అట్లే చెడు సంపర్కము వలన చెడు కలుగును. కుండెడు క్షీరములో ఒక బిందువు విషము అంత క్షీరమును పాడుచేయును. హోమగుండములోను, ఇతరత్రా ఆరాధ్యదైవముగానున్న అగ్ని తుచ్ఛమైన ఇనుముతో చేరి సుత్తి దెబ్బలకు గురౌతుంది. కుసంపర్కము చేతనే ఇట్ట అధోగతి. దీనిని పురస్కరించుకనియే

సత్సంగత్వే నిస్సగత్వమ్ నిస్సగత్వే నిర్మోహత్వమ్
నిర్మోహతేవ నిశ్చలతత్త్వమ్ నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

లోకములోని సమస్త దుఃఖములకు, చింతలకు, అశాంతికి కారణము లేకపోలేదు. మానవుని నిరాశా నిస్పృహలకు పరులు కారణము కాదు. మన దృష్టిదోషము, వాగ్దోషము, శ్రవణదోషమే. నిరంతరమూ మానవుని కన్నులు ఇతరులు దోషములు చూచిన లాభమేమి? నిరంతరమూ పరుల దోషములు ఉచ్చరించుటలోనే మీ నాలుక ప్రయత్నించును. అది పఠించుట వలన లాభమేమి? పరుల దోషములను శ్రవణము చేయుట వలన ఏమి లాభము? దీని వలన మీ ఇంద్రియములు అపవిత్రములు, దోషభూయిష్టములగుచున్నవి. 'యద్భావం తద్భవతి'– బయట ఏమి చూచిన ఆ భావములే కలుగును. అందుచే పరుల దోషములయందు గ్రుడ్డి, చెవిటి, మూగ ఎవరు అగుదురో వారు మంచివారు. పరులలోని దివ్యత్వమును గుర్తించాలి. దివ్యమైన నాలుకను పవిత్రమైన రామనామమును ఉచ్చరించుటకు ఉపయోగించాలి. కాని, ఇతరుల దోషములను వల్లించుటకు కాదు. అట్లే దివ్యమైన దృష్టి సుందరత్వమును కన్నులతో గ్రహించాలి. మీ దృష్టికి ఆకారవికారములు కల్పించిన సాకారము చేసుకోవాలి. అందుచేతనే ప్రహ్లాదుడు,

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని

దయయు సత్యంబు లోనుగా దలపడేని
పుట్టనేటికి తల్లుల కడుపుచేటు

జీవితము వ్యర్థము అన్నాడు.

'జంతూనాం నరజన్మ దుర్లభమ్' ఇట్టి నరజన్మను పవిత్రమైన విధంగా నడుపుకోలేని ఎడల పశుజన్మయే ఉత్తమం. ఈనాటి విద్యావిధానంలో 'విద్యయొక్క గమ్యమేమి' అని తెలుసుకోవటం లేదు. జీవితమంటే కేవలము 'ఖానా, పీనా, సోనా, మర్నా' ఈ నాలుగేనా? ఇవి మానవునకు, పశువునకు ఒకటే. ఈనాటి మానవుడు భోగలాలస, భోగసంపాదనలయందు ఓలలాడుతున్నాడు. ధనబలము, బుద్ధిబలము, శక్తిబలము ఇవే జీవితమనుకుంటున్నాడు. ప్రతి మానవుడు 'enjoy, enjoy' అనుచున్నాడు. ఈ enjoy కి అర్థమేమిటి? అది నిజంగా end joy ప్రతి కర్మలు ఆదర్శప్రాయముగానుండి, అంత్యస్థితిని లేదా చరమ స్థితిని నిరూపించేదే enjoyment

మానవుని సోదరత్వము, భగవంతుని పితృత్వమును వృద్ధిచేసుకొని, తోటి మానవులను, సాటి జనుల దుఃఖానికి సహాయపడని మానవజన్మ జన్మ కాదు. మానవత్వమనగా నీటి పై తైలపుబొట్టు కాదు. సమాజము లేక మానవుడు ఒక్క క్షణమైనా జీవించలేడు. అట్టి సమాజ గౌరవము, క్షేమము ఆలోచించి, స్వార్థము విడిచి, విశాల హృదయమును అభివృద్ధి పరచుకోవాలి. దీనిని పురస్కరించుకొని జ్ఞానము మూడు రకములు. సామాన్య జ్ఞానము, సుజ్ఞానము, విజ్ఞానము. నేను, నా స్నేహితులు, నా బంధువులు, నా వారు అనునది సామాన్యజ్ఞానము. ఇది కేవలము బావిలోని కప్ప జీవితము వంటిది. సర్వ జీవములలోని గుణములను క్రోఢీకరించుకొని, మంచి జీవనమును పోషించుకొనుట సుజ్ఞానము. ఇది చెఱువుతో సమానము. ఇక మూడవది. 'ఈశ్వరస్సర్వ భూతానామ్, వాసుదేవ సర్వమిదమ్' ఈశ్వరుడు అందరిలోనూ ఉన్నాడను విశాలభావము. ఇది సముద్ర సమానము. ఇట్టి విజ్ఞానము విరాట్‌స్వరూపము.

మన ధ్యానము, కీర్తనలు, భజనలు పరమాత్మ సంతృప్తి కొరకు కాదు. మన తృప్తికే. పరమాత్మకు ఏమి కావాలి? పరమాత్మ గుణగణములను కీర్తించిన అవి మనలో చేరును. ఎట్టి పదార్థముల చింతన సలుపుతామో అట్టి గుణములు మనలో చేరును. నిమ్మపండు అనుటతోనే మన నోటిలో నీరూరును. అశుద్ధికరమైన వస్తువులను చూచిన డోకు కల్గును. మనము కూర్చున్న స్థానములో పాము, పామన్న పామును చూడకపోయిననూ భయము కల్గును. లౌకిక పేర్ల వలననే ఇట్టి మార్పు కలిగిన , పరమ పవిత్ర స్వరూపుని నామము వలన ఎట్టి మార్పు కలుగునో! కల్యణ స్వరూపుని గుణగణములు వర్ణించిన మనలో అట్టి పవిత్ర గుణములు ఆవిర్భవించును. అందుచేతనే పవిత్రమైన చింథలు, కార్యములు చేయుటకు ప్రయత్నించాలి. అజ్ఞానులైన గోపికలకు వేదశాస్త్రమును బోధించుటకు నారదుడు వెళ్ళగా అక్కడ పరికింఛినదేమన, గోపికలు ఏవిధమైన జ్ఞానము, తపము లేకుండా కృష్ణా, కృష్ణా అని నిరంతర కృష్ణ చింతన తప్ప ఏమియూ లేదు. ఆ కృష్ణా, కృష్ణా అను నామము వారి తృష్ణగా పరిణామము చెందెను. గోపికలకు కృష్ణతృష్ణతో జీవితమే కృష్ణమయముగా మారిపోయెను. వారిలో యిట్టి గొప్పతనము ఎట్లు వచ్చినదని ప్రశ్నించగా కాగితము మీద ఎట్లు ప్రతిమ ఏర్పడునో అట్లే తమ హృదయముల మీద కృష్ణ ప్రతిమ ఏర్పడినదన్నారు. మరొక సమయంలో రాధను ఒకరు ప్రశ్నించిరి, 'నిరంతరమూ కృష్ణుని స్మరించి, నీవే కృష్ణుడుగా మారిపోయిన ఇక నీకేమి ఆనంధము, సంతోషము?' దానికి రాధ, 'నీరజా! నిరంతర కృష్ణ చింతనలో నేను కృష్ణునిగాను, రాధ చింతనలో కృష్ణుడు రాధగాను అగు అవకాశమున్నది' అన్నది. అందుచే మానవులు ఎట్టి పవిత్ర భావములతో నింపుకుందురో అట్టి గుణములే మనలో చేరును. అన్యాయ, అక్రమ, అనాచార భావముల వలన అశుద్ధమైన వాతావరణమును పరిశుద్ధమైన నామసంకీర్తనముచేత నిర్మల ఆనందమును పొందాలి. మీ ఆశనిరాశలలో, సుఖదుఃఖములలో భగవానుని నామము మరువరాదు. సృష్టిలో సుఖదుఃఖములయొక్క అలలు, తెరలు ఉండును. మన దుఃఖములు కూడను పవిత్ర స్థానమును అందించుటకే అనుకొని, దానిని భగవన్నామ చింతనతోనే అరికట్ట వలెను. భగవంతుడు ఏది ప్రసాదించినా భగవంతుని ప్రసాదముగా గ్రహించాలి. ఎప్పుడునూ బిడ్డకు మధురమైన ఆహారమునందించి తల్లి, బిడ్డకు విషజ్వరము వచ్చిన చేదు మందులు యిచ్చును. అది బిడ్డపై ప్రేమతోనే. బిడ్డ అపమార్గములో ప్రవేశించిన కొట్టుట ప్రేమతోనేగాని, కోపము, ద్వేషములతో కాదు. అట్లే భగవంతుడు, విశ్వమాతగా ఏవిధమైన దుఃఖములు అందించిననూ అది ప్రేమతోనే అని గ్రహించాలి. సుఖమునకు పొంగక, దుఃఖమునకు క్రుంగక సమదృష్టి, ఇంద్రియనిగ్రహముఅలవరచుకోవాలి. ఇంద్రియనిగ్రహమన్న అన్నిటినీ అరికట్టుట కాదు. సమదృష్టిని కలిగియుండుట. ఇతరుల దోషములను వినక వారి మంచిని, ఆరోగ్యమును, సౌభాగ్యమును కోరుట అలవాటు చేసుకోవాలి. పరులలోని మంచిని, తనలోని దోషమును ఏ మానవుడు చూచునో అతడే నిజమైన సాధకుడు. అప్పుడు తనలోని దోషములు పోగొట్టుకొని, పరుల మంచితనమును అలవరచుకొనును. గృహములోని వస్తువులను, పాత్రలను శుభ్రపరచుకున్నట్లు అప్పుడప్పుడు మనసును సరిదిద్దుకొని, సత్సంగములో చేరి సంతోషముగానుండుటకు ప్రయత్నించాలి. భజన హృదయ పరిశుద్ధమునకు ముఖ్యము. అది మనకే కాక వినువారి హృదయములను కూడ పరిశుద్ధము చేయును. మన సాధన కొరకు, మన ఆనందము కొరకు భజన చేయుదుము. ఎన్ని గ్రంథములు చదివిననూ, ఎన్ని సాధనలు చేసిననూ భజన చేసిన వచ్చు ఆనందము రాదు.